విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె

విశాలాంధ్ర - పరవాడ: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశత్వాన్ని విడనాడి న్యాయం చేయాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె నాల్గవ రోజు కొనసాగింది. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన ధర్నా శిబిరాన్ని గనిశెట్టి సందర్శించి మాట్లాడారు. అంగన్వాడీలకు కనీస వేతనాన్ని రూ.26 వేలు అమలు చేసి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేసి లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు ఇవ్వాలని, ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని, 2017 నుండి టీఏ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేసారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అంగన్వాడీలతో కలిసి డిప్యూటీ తహశీల్దార్ శాంతి భూషణ్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, అంగన్వాడి యూనియన్ నాయకులు దేవి, రమణి, అమ్మాజీ, కృష్ణవేణి, అక్కలమ్మ తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: అంగన్వాడీల సమ్మె కొనసాగుతోంది. మండలంలో సుమారు 23 అంగన్వాడీ కేంద్రాలను సీడీపీఓ, సూపర్వైజర్లు కలిసి తాళాలను బద్దలు కొట్టి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఆగ్రహించిన అంగన్వాడి కార్యకర్తలు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయానికి చేరుకుని సిబ్బందిని బయ టకు పంపించి తాళాలను వేసి నిరసన తెలియజేశారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

పరిహారం విడుదల చేయండి

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో కనమాం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సర్వే నంబర్ 50లో సుమారు 157.77 ఎకరాలు భూమిని ప్రభుత్వం సేకరించి, ప్రభుత్వానికి భూమి ఇచ్చిన 60 మంది రైతులకు ఇంకా నష్టపరహారం అందలేదని రైతులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారని, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అప్పలనాయుడు తెలిపారు. రైతులకు కావలసిన నిధులు వెంటనే మంజూరు చేయాలని భీమిలి ఎమ్మెల్యే అవంతి సమక్షంలో టీటీడీ మాజీ చైర్మన్, రీజనల్ కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డికి వినతిపత్రాన్ని అందించారు.

లోకేష్ యువగళంను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువ నాయకులు నారా లోకేష్ బాబు చేపట్టిన యువ గళం పాదయాత్ర ముగింపు కార్యక్రమం 17వ తేది సాయంత్రం అగనంపూడి పైలాన్ వద్ద జరుగుతుందని విజయవంతం చేయాలని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, 75వ వార్డు అధ్యక్ష కార్యదర్శులు నమ్మి అప్పారావు, దొమ్మేటి పెరుమాళ్, గోక్యాడ ముత్యాలు, శ్రీముసిరి శ్రీనివాసరావు, ములకలపల్లి పెంటయ్య, అండిబోయిన రాము నాయుడు, ఉరుకుటి అప్పారావు, మొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలను సందర్శించిన రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరి, చిలకలగెడ్డ బాలుర, కొత్తూరు కస్తూరిబా బాలికలు వసతి గృహాలను రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ విజయ ప్రతాపరెడ్డి సందర్శించారు. వసతి గృహాల్లో ఇచ్చే ఆహారం వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆశ్రమ విద్యార్థులకు ఏ విధమైన మెనూ పెడుతున్నారని మండల అదనపు గిరిజన సంక్షేమ అధికారి వెంకటరమణను అడిగి తెలుసుకున్నారు. అయితే ఈ మెనూలో కొద్దిగా మార్పు చేయాలని ఈ విషయం ప్రభుత్వంతో చర్చిస్తానని ఉప్మా బదులు ఫ్రైడ్ రైస్ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు ఏటీడబ్ల్యు, మండల విద్యా శాఖాధికారి తదితరులు ఉన్నారు.

వైసీపీ విశాఖ జోనల్ ఇన్‌ఛార్జిగా చిక్కాల రామారావు

విశాలాంధ్ర - పాయకరావుపేట: వైసీపీ విశాఖ జోనల్ ఇన్‌ఛార్జిగా మండలంలోని పెంటకోట గ్రామానికి చెందిన చిక్కాల రామారావు నియమిస్తూ పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. చిక్కాల రామారావు ఉమ్మడి విశాఖ జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గాను, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులుగా, పాయకరావుపేట మండల వైసీపీ మండల అధ్యక్షులుగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. చిక్కాల రామారావును పదవి పట్ల పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

డేగలపుట్టులో ఫ్యామిలీ ఫిజీషియన్

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండలంలో గల జర్రెల పంచాయతీ డేగల పుట్టు గ్రామంలో 104 వైద్యాధికారిణి శిరీష ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యదికారిణి శిరీష మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరంలో 53 మంది రోగాలబారిన పడిన వారికి రక్త పరీక్షలు నిర్వహించి అవి సాదరణ జ్వరాలుగా గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పి. ఏఎన్ఎం. ఆశా కార్యకర్తలు. 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనసేన జిల్లా ఉపాధ్యక్షులుగా ఈఎన్ఎస్ చంద్రరావు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జనసేన జిల్లా ఉపాధ్యక్షులుగా ఈఎన్ఎస్ చంద్రరావు నియామకం అయ్యారు. చంద్రరావు 1985 నుండి రాజకీయ పార్టీలతో సంబంధాలు ఉండి 2009లో ప్రజారాజ్యం పార్టీ భీమిలి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే ఉద్దేశంలో నామినేషన్ కూడా వేసి అప్పటి ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా పోటి నుండి విరమించుకొని, కింగ్ మేకర్‌గా ప్రజా సేవలో ఉంటూ, మధురవాడ, పీఎం పాలెం పరిసర ప్రాంతాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ఏ అధికార పార్టీ ఉన్న వారి ద్వారా ప్రజా అవసరాలు కొరకు నిత్యం ప్రయత్నిస్తూ అన్ని పార్టీలలో అందరి అభిమానాన్ని పొందారు. గత తొమ్మిది నెలల క్రితం అధికార పార్టీలో కొనసాగుతూ జనసేన పార్టీ వారు పిలుపుమేరకు అధికార పార్టీని తృణప్రాయంగా వదిలి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా కండువా వేయించుకున్నారు. ఈ మేరకు చంద్రరావును ఉపాధ్యక్షులుగా నియామకం అయ్యారు. పార్టీని అధికారంలోకి తెచ్చే విధంగా ప్రయత్నం చేస్తానని తెలిపారు.

రావిశాస్త్రి సాహిత్యం సమాజహితం

విశాలాంధ్ర - విశాఖ: రావిశాస్త్రి సాహిత్యం సమస్తం సమాజహితం కోసమేనని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రావిశాస్త్రి సాహిత్య సమాలోచన సభలో రాంభట్ల నృసింహశర్మ, ఆచార్య డివి సూర్యారావు, ఆచార్య వెలమల సిమ్మన్నలు మాట్లాడుతూ అట్టడుగు జనావళి బతుకుల్ని అక్షరం అక్షరంలోను ఒదిగేలా చేసిన 'అల్పజీవి'లో కనిపిస్తాయని అన్నారు. రావిశాస్త్రి రచించిన నెలలైనా, కవితైనా, కథైనా, నాటకమైనా విమర్శనాత్మకంగానే ఉంటాయని అన్నారు. సభకు అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షత వహించగా కవులు డాక్టర్ కేవీఎస్ మూర్తి, అడపా రామకృష్ణ, మేనేజర్ రాజు, క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా మండల పరిషత్ బడ్జెట్

విశాలాంధ్ర - కె.కోటపాడు: ఈ సంవత్సరం మండల పరిషత్ బడ్జెట్ ఎంతో ఆశాజనకంగా ఉందని ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బడ్జెట్ ఆమోదంపై మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. గత సంవత్సరం కన్నా ఈ ఏడాది ముగింపు నిల్వ అధికంగా ఉందన్నారు. ఈ సంవత్సరం లాగే వచ్చే ఏడాది మరిన్ని సంక్షేమ కార్యక్రమాలకు నిధులు ఖర్చు చేయవచ్చునని సభ్యులకు సూచించారు. అంతకుముందు ఎంపీడీవో వివి ప్రసాద్ మాట్లాడుతూ 2023 - 24 సంవత్సరంలో 62 కోట్ల 23 లక్షల 42,000 రాబడి కాగా 59 కోట్ల 29 లక్షల ఐదువేల రూపాయలు ఖర్చు అయిందన్నారు. మిగులు నిల్వ రెండు కోట్ల 94 లక్షల 37 వేల రూపాయలుగా ఉందని అన్నారు. అలాగే 2024 - 25 సంవత్సరానికి అంచనా బడ్జెట్ రూపొందించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రొంగలి సూర్యనారాయణ, కింతాడ, గుండుపాలెం, కె.కోటపాడు తదితర గ్రామాల ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాల పరిశీలన

విశాలాంధ్ర - వి.మాడుగుల: మండలంలోని సత్యవరం గ్రామంలో పంట కోత ప్రయోగాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు మాట్లాడుతూ మండలంలో అధిక విస్తీర్ణంలో సాగవుతున్న ప్రధానమైన వరి పంట ఉత్పత్తుల దిగుబడి అంచనాలు రూపొందించుట కొరకు పలు గ్రామాలలో పంట కోత ప్రయోగాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా సత్యవరంలోని కోన కొండబాబు రైతు పండించిన వరిక్షేత్రంలో కొంత విస్తీర్ణంలో పండిన పంటను కోత కోసి నూర్పిడి చేసి వచ్చిన ధాన్యాన్ని తూకం వేసి పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది టి.గౌరినాయుడు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నేడు గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

విశాలాంధ్ర - మునగపాక: ఉత్తరాంధ్ర ఇలవేల్పు ప్రసిద్ధిగాంచిన మునగపాక మండలం చూచుకొండ పెంటకోట వారి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం శనివారం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. నేల వేషాలు, తప్పిడి గుళ్ళతో భారీ సంఖ్యలో సాయంత్రం ఊరేగింపు నిర్వహిస్తున్నామని అన్నారు. మందు గుండు విద్యుత్ అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని పేర్కొన్నారు.

పేదల జీవితానికి భరోసా సీఎం జగన్

విశాలాంధ్ర - అచ్యుతాపురం: పేదల జీవితానికి భరోసా ఇచ్చిన సీఎం జగన్ మోహన్ రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలని యలమంచిలి ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు (కన్నబాబురాజు) అన్నారు. శుక్రవారం మండలంలో చీమలాపల్లి సచివాలయ పరిధిలో ఏపీకి జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు జరుగుతున్నాయన్నారు. 14 ఏళ్ళు సీఎంగా పనిచేసిన చంద్రబాబు ప్రజల కోసం ఒక పథకం అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ యు సుకుమార వర్మ (తేజ), ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో - జడ్పిటిసి సర్మాల కుమార్, మండల పార్టీ అధ్యక్షులు దేశంశెట్టి శంకరరావు, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి పిన్నమరాజు వాసు, ఎంపీటీసీ నగిరెడ్డి నాగేశ్వరరావు, ఎంపీటీసీ లాలం శ్రీను, వైసీపీ నాయకులు ఉమ్మిడి జగన్, బలిరెడ్డి శ్రీను, ఉమ్మిడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

భారత రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ పునర్నిర్మాణ కమిటీ మెంబర్‌ల నియామకం



విశాలాంధ్ర - అరకులోయ: భారత రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ ఎస్‌సీసీ పునర్నిర్మాణం మెంబర్లుగా అరకు పార్లమెంటు ఏరియాలోని వ్యక్తులు, సాధారణ ప్రజలు కేటగిరీ కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ఎస్‌సీసీ స్టేషన్లలో నామినేట్ చేయబడే వ్యక్తుల జాబితాలో అరకులోయ మండలం ప్రాంతంలో నుంచి పెనుమాక రవికుమార్, కుడా కృష్ణారావు, బి.డొంబునాయుడు, బిసైయి మూర్తి, జన్ని చినతల్లిని నియామకం చేసినట్టు రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ మనోచా తెలిపారు. తమకు ఈ అవకాశం ఇచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి, జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావుకి, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బీచ్ పరిసరాలలో పరిశుభ్రతా చర్యలు చేపట్టండి

జీవీఎంసీ కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ

విశాలాంధ్ర - సాగర్ నగర్: మహా విశాఖ నగర పాలక సంస్థ, జోన్-2, జోడుగుల్లపాలెం బీచ్ పరిసరాలలో వ్యర్థాలు లేకుండా నిత్యం పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సిఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన 9వ వార్డు కార్పొరేటర్ కోరుకొండ స్వాతి రత్నదాస్, జీవీఎంసీ అధికారులతో కలసి జోడుగుల్లపాలెం, విశాలాక్షినగర్ పరిసర ప్రాంతాలలో పర్యటించారు. ఈ పర్యటనలో జోడుగుల్ల పాలెం బీచ్ నందు వ్యర్థాలు లేకుండా పర్యాటకులకు, స్థానికులకు ఇబ్బంది కలుగకుండా నిత్యం పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని జోనల్ కమీషనర్‌కు ఆదేశించారు. జోడుగుల్లపాలెం బీచ్ నందు చేపల వేటకు సంబంధించిన సామాగ్రిని భద్రపరచుకొనేందుకు మత్స్యకారులకు ఒక షెడ్‌ను, రజకుల కుల వృత్తికి ధోభీఖానా నిర్మించాలని కార్పొరేటర్ స్వాతి రత్నదాస్ కమీషనర్‌కు విజ్ఞప్తి చేశారు. బీచ్ నందు ఆక్రమించిన ప్రదేశాన్ని గుర్తించిన ఆక్రమిత స్థలాన్ని ఖాళీ చేయించి, తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని కార్య నిర్వహణ అధికారి శాంసన్ రాజు, జోనల్ కమీషనర్‌కు, సంబందిత టి.పి.బి.ఒ. ను కమీషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇ.ఇ. శాంతి రాజు, డిడిహెచ్ ఏం.దామోదరరావు పాల్గొన్నారు.

పాండ్రంగి బ్రిడ్జి పనులు ప్రారంభం

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీలో శుక్రవారం బ్రిడ్జి పనులను వైసీపీ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి స్థానిక ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ పాండ్రంగి పంచాయతీ కాకుండా ఈ రోడ్డు గుండా ప్రయాణించే చుట్టుపక్కల ప్రాంతాలు వారికి కూడా ఈ బ్రిడ్జి చేయడం వల్ల ఎంతో ఉపయోగకరమన్నారు. గోస్తని నదికి హారతి ఇచ్చి అనంతరం వైవి సుబ్బారెడ్డి చేతుల మీదగా పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైవి సుబ్బారెడ్డి, అవంతి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎంతమంది నాయకులు వచ్చినా పాండ్రంగి బ్రిడ్జి ఇప్పటివరకు తీరని కలగా మిగిలిపోయిందని ఎన్నో బాలారిష్టాలు దాటుకొని ఈ రోజుకి మోక్షం కలిగిందని అన్నారు. సుమారు 16 కోట్ల 50 లక్షల పిఆర్ఆర్ నిధులతో పనులు ప్రారంభించడం జరిగిందని మొదటి అంచనా వ్యయం 14 కోట్లు కాగా అంతకుమించి ఖర్చు అవుతుందని అధికారులు తెలియజేయగా మరల ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా సీఎం జగన్మోహన్ రెడ్డి 16 కోట్ల 50 లక్షల రూపాయలు గ్రాంట్ ఇవ్వడం జరిగిందని అన్నారు. అనంతరం డిసెంబర్ 28, 29వ తేదీల్లో అవంతి కాలేజీలో ఏపీఎస్ ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జరగబోవు మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అర్హులైన లబ్ధిదారులకి రెండో విడత ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలో ఉన్న ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైసీపీ మండల అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆర్డీఓ తదితరులు పాల్గొన్నారు.

తాండవ చక్కర కర్మాగారం ఇన్‌ఛార్జి ఎండిగా ప్రసాదరావు

విశాలాంధ్ర - పాయకరావుపేట: తాండవ చక్కర కర్మాగారం ఇన్‌ఛార్జి మేనేజింగ్ డైరక్టర్‌గా పి.ప్రసాదరావు నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గోవాడ చక్కర కర్మాగారంలో చీఫ్ ఇంజనీరుగా పనిచేస్తున్న ప్రసాదరావును తాండవ చక్కర కర్మాగారానికి చీఫ్ ఇంజనీరుగాను, ఇన్‌ఛార్జి మేనేజింగ్ డైరక్టర్‌గాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇన్‌ఛార్జి ఎండిగా బాధ్యతలు స్వీకరించిన ప్రసాదరావును కర్మాగారంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు, కార్మికులు అభినందనలు తెలిపారు. భీమసింగి చక్కర కర్మాగారం ఎండిగా ఉన్న విక్టర్‌రాజు ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌ఛార్జి ఎండిగా పనిచేశారు.

కాప్-28 మాక్ కాన్ఫరెన్స్‌లో కేజీబీవీ విద్యార్థినీల ప్రతిభ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కేజీబీవీ విద్యార్థినుల వివిధ దేశాల ప్రతినిధులుగా వ్యవహరించి ఆయా దేశాల ప్రజల వేషధారణతో, జెండాలతో కోప్-28 గురించి ఆంగ్లం, హిందీ భాషలలో మాట్లాడుతూ తమ ప్రతిభను చాటుకున్నారు. పెందుర్తి మహిళా ప్రగతి కేంద్రంలో జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో శుక్రవారం కాప్-28 (కాన్ఫరెన్స్ ఆఫ్ ది పార్టీస్) మాక్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రపంచంలో ఉన్న పునరుత్పాదక ఇంధన శక్తి మూడింతలు పెరగాలని, 2030 నాటికి మూడు రెట్లు పెరగాలని, చమురు, గ్యాస్, బొగ్గు వినియోగాన్ని తగ్గించాలనే వాదనను ప్రతినిధులుగా వ్యవహరించిన విద్యార్థినులు బలంగా వినిపించారు. అనంతరం మూడు కేజీబీవీల ప్రిన్సిపాళ్లు, విద్యార్థినులు డీఈవో చంద్రకళ, ఏపీసీ శ్రీనివాస్‌లతో కలిసి జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్‌ను కలిశారు. కార్యక్రమాల్లో ఆనందపురం కేజీబీవీ ప్రిన్సిపాల్ చంద్రకళ, భీమిలి ప్రిన్సిపాల్ కుమారి గంగ, పద్మనాభం ప్రిన్సిపాల్ లిల్లీ గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ నైపుణ్యంతో ప్రజలకు వైద్య సేవలు

విశాలాంధ్ర - మధురవాడ: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవసరమైన అంతర్జాతీయ నైపుణ్యాలను భారతీయ వైద్యులు సాధించాలని గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీ భరత్ పిలుపునిచ్చారు. సొసైటీ ఫర్ హెల్త్ కేర్ సిమ్యులేషన్ ఆధ్వర్యంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) వైద్య కళాశాల, జిఎస్ఎల్ వైద్య కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న ఐదవ జాతీయ సిమ్యులేషన్ సమావేశాలను శుక్రవారం ప్రారంభించారు. శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించడానికి మెడికల్ సిమ్యులేషన్ పరిజ్ఞానం ఎంతో ఉపయోగ పడుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఫర్ హెల్త్ కేర్ సిమ్యులేషన్ జాతీయ అధ్యక్షుడు, ప్రముఖ శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ ఎస్.శ్రీరామచంద్ర మూర్తి, జిమ్‌సర్ ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, జిఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్, జిమ్‌సర్ డీన్ డాక్టర్ ఎస్.పి.రావు, డాక్టర్ ఆర్.రమణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు లోకేష్ యువగళం పాదయాత్రను జయప్రదం చేయండి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువ గళం పాదయాత్ర పట్టణంలో 3100 కిలోమీటర్లు పూర్తవుతుందని అనకాపల్లి జిల్లాలో ఉన్న టీడీపీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు, మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. 16వ తేదీ మధ్యా హ్నం ఎలమంచిలి నియోజకవర్గంలో నుండి పాద యాత్ర పూర్తి చేసుకుని మధ్యాహ్నం 12 గంటలకు నాగులపల్లి జంక్షన్ బైపాస్ వద్ద అనకాపల్లి నియోజకవర్గంలోకి ప్రవేశిస్తారని అన్నారు. మధ్యాహ్నం 12:15 నిమిషాలకు విశాఖ డైరీ వద్ద ప్రైవేటు స్థలంలో లంచ్ చేస్తారని, 2:00 గంటలకు ముఖాముఖి కార్యక్రమం గంట సమయం ఉంటుందని, 4:00 గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుందని, 4:45 నెహ్రూ చౌక్ జంక్షన్ కు 5:00 వేల్పుల వీధి నందమూరి తారక రామారావు విగ్రహం 5:15 శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం జంక్షన్, 5:30 రింగ్ రోడ్డు జంక్షన్ 5:45 బాలకృష్ణ బస్ స్టాప్ జంక్షన్, 6:00 శ్రీ పరమేశ్వరీ పార్క్ జంక్షన్ 6:15 శ్రీ సంతోషి మాత కోవెల రోడ్డు 6:30 గంగిరేమి చెట్టు మీదగా సంతబయల 6:45 శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ ఆర్చి వద్దకు చేరుకుంటారని ఇక్కడతో అనకాపల్లి పట్టణంలో లోకేష్ యువ గళం పాదయాత్ర ముగుస్తుందని తెలిపారు.

షేక్ బాజ్జి మృతి తీరని లోటు

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ షేక్ షాబ్జి మృతి ఉపాధ్యాయులకు తీరని లోటని మండల యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.ధర్మారావు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సమరెడ్డి రాజు, సీసా గోపి అన్నారు. షేక్ షాబ్జి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. యూటీఎఫ్‌కు ప్రజాతంత్ర ఉద్యమాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల కార్యవర్గం శ్రీనివాసమూర్తి, తిరుపతిరావు, సూర్యనారాయణ, సిఆర్.పి. అనిల్ కుమార్, హరి, సురేష్, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

విశాలాంధ్ర - డుంబ్రిగూడ: మండలంలోని నారింజవలసలోని అరకు-పాడేరు జాతీయ రహదారిలో ఆటోను కారు ఢీకొన్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. చాపరాయి జలవిహారిని తిలకించిన పర్యాటక కారు అరకు వైపు వెళ్తుండగా అదే క్రమంలో అరకు వైపు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఆటో పల్టీలు కొట్టి తిరగబడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఐదు గురుతోపాటు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రు లను స్థానికుల సాయంతో పోలీసులు అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. కారులో ఉన్న పర్యాటకులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. క్షతగా త్రులు కంద్రుం పంచాయతీ నువ్వగుడ గ్రామానికి చెందినవారు.

షిప్‌యార్డు రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

విశాలాంధ్ర - మల్కాపురం: హిందుస్థాన్ షిప్‌యార్డు రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేత బి.సత్యానందరావు అధ్యక్షతన సీపీఐ కార్యాలయంలో సమావేశం జరిగింది. గత పదేళ్ల నుండి రావాల్సిన బకాయిలు యాజమాన్యాలు దఫాదఫాలుగా చెల్లించారని, 2022 నుంచి 2023 రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన లీవు ఎన్‌క్యాష్‌మెంట్ ఒక్కసారి ఇవ్వకుండా 6 నెలలకు మాత్రమే చెల్లించారని అన్నారు. నవంబర్ నెలలో చెల్లించాల్సిన పేమెంట్లు చెల్లించలేదన్నారు. మిగతా 6 నెలల పేమెంట్‌ను డిసెంబర్ నెలాఖరు లోగా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బివిఎన్ పాత్రో, ఎన్‌వి రమణారావు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై అవగాహన

విశాలాంధ్ర - భీమిలి: ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఇంధన పొదుపుపై అవగాహన కల్పించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. కార్యక్రమంలో రొంగలి రమేష్, సకరయ్య, బొట్ట రవి, కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రసాద్ పాల్గొన్నారు.

జనవరి 29,30 తేదీల్లో కార్మికుల సమ్మె

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: ఆర్ఐఎన్ఎల్‌లో నూతన వేతనాలు అమలు చేయాలని, కార్మికులకు ఎరియర్స్ చెల్లించాలని, కార్మికులకు అదనపు ఇంక్రిమెంట్ ఇవ్వాలని ,కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని, అలవెన్సెస్ చెల్లించాలని తదితర డిమాండ్లతో జనవరి 13వ తేదీన సమ్మె నోటీసు ఇవ్వనున్నట్టు పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ తెలిపారు. జనవరి 29, 30 తేదీల్లో సమ్మె చేయదానికి నిర్ణయి ంచారు. కార్యక్రమంలో జె. అయోధ్య రామ్, నీరుకొండ రామ చంద్రరావు, మస్తానప్ప, పోరాట కమిటీ ప్రతినిధులు, స్టీల్ ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన స్వచ్ఛ పక్వాడ పక్షోత్సవాలు

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ స్థానిక ఎన్.ఎస్.టి.ఎల్ (డి.ఆర్.డి.ఓ)లో స్వచ్ఛ పక్వాడ పక్షోత్సవాలు ఘనంగా ముగిసాయి. పరిశుభ్రతకు సంబంధించి కొత్త ఆలోచనలను పంచుకోవడం, ప్రోత్సహించడం కోసం ఇంటరాక్టివ్ సెషన్ జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌వి సత్య శ్రీనివాస్, సైంటిస్ట్ 'జి', లెఫ్టినెంట్ కల్నల్ రాహుల్ దీక్షిత్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు రూ.10వేలు విరాళం

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖలో దాబాగార్డెన్ నెల్లూరు మెస్ వద్ద(ప్రెస్ క్లబ్ దగ్గరలో) శోభన్ బాబు విగ్రహావిష్కరణకు శోభన్ బాబు సేవా సంఘం అధ్యక్షులు, రాష్ట్ర యువశక్తి అవార్డు గ్రహీత నందవరపు సోములు పదివేల రూపాయలు విరాళం అందించారు. శోభన్ బాబు సేవా సంఘం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో విశాఖ సిటీ వైడ్ ఫ్యాన్స్ సభ్యులు, త్రిమూర్తులు, రమణ, కనకరాజు, బెహరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర - చింతపల్లి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 21వ తేదీన చింతపల్లి పర్యటనకు సంబంధించి సాధ్యసాధ్యాలపై పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, స్థానిక ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్‌లు శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. చింతపల్లి కేంద్రంగా ముఖ్యమంత్రి పర్యటన సభా కార్యక్రమాల ఏర్పాటుకు స్థలాలను క్షుణంగా పరిశీ లించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబులను పంపిణీ చేసేందుకు ముఖ్యమంత్రి చింతపల్లి రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి అనూష దేవి, స్థానిక సర్పంచ్ పుష్పలత, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డివిఆర్ఎం రాజు, సీఐ రమేష్, ఎస్సై అరుణ్ కిరణ్, ఎంపీటీసీలు దారలక్ష్మి, జయలక్ష్మి, చౌడుపల్లి సర్పంచ్ లలిత, వైసీపీ మండల అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

శివ దలాయికి వరల్డ్ వైడ్ అవార్డ్

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీలో నివాసం ఉంటున్న శివ ఓఎస్‌జీ ఫౌండేషన్ అధ్యక్షులు శివ దలాయికి వరల్డ్ వైడ్ అవార్డు లభించింది. నిత్యం పలు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సేవలను గుర్తించిన అకాడమీ ఆఫ్ సొక్చార్త్ వారు వరల్డ్ వైడ్ 2023 బెస్ట్ సోషలిస్ట్ యాక్టివిస్ట్ అవార్డ్ అందించారు. భువనేశ్వర్ జయదేవ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సులోచన దాస్ ఆధ్వర్యంలో ఈ అవార్డును అందుకున్నారు.

గోవాడ సుగర్స్‌లో చెరకు గానుగాట శుభారంభం

విశాలాంధ్ర - చోడవరం: రాష్ట్రంలోని సహకార రంగంలో నడుస్తూ, అన్నింటా అగ్ర పథాన నిలిచిన అనకాపల్లి జిల్లా చి.చోడవరం సహకార చక్కెర కర్మాగారం (గోవాడ)లో 2023-24 సీజన్ కు గాను ఎం.డి. వి.సన్యాసి నాయుడు శుక్రవారం ఉదయం గం. 9.32ని.లకు పూజలు చేసి చెరకు గానుగానుట శుభ ఆరంభం చేశారు. ఈ ఏడాది 2 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ లక్ష్యం తో గానుగాటకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. గతేడాది 2 లక్షల 21 వేల ఎం.టి. చెరకు గానుగాడినట్లు తెలియజేశారు. ఎన్నో ఆర్థిక ఒడిదుడుకుల మధ్య ఈ ఏడాది చెరకు గానుగాట కీలకంగా మారిందన్నారు. ఫ్యాక్టరీ చరిత్రలో కీలకమైన దశ అని తెలిపారు. సభ్య రైతులు, కార్మికులు గతంలో వలె చెరకు గానుగాటకు, సహకరించ వలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సి.ఈ. ప్రసాద్, సి.డి.ఒ. కె.రామం, తిరుమలరావు, రామారావు, యేడువాక శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు కె.భాస్కరరావు, ఫీల్డ్ ఇన్స్పెక్టర్‌లు ఎస్.వి.నాగేశ్వర రావు, దొర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో క్రిస్మస్ సందడి

విశాలాంధ్ర - హుకుంపేట: డిసెంబర్ నెల ఆరంభం అయిందంటనే క్రైస్తవుల కుటుంబాల్లో క్రిస్మస్ సంబరాలు మొదలవుతాయి. షాపింగ్స్, కేక్ కటింగ్, ఇంటి డెకరేషన్స్, చర్చిలన్నీ విద్యుత్ కాంతులతో కళకళాలాడుతుంటాయి. ఇంకా కొంతమంది ముందస్తుగా క్రిస్మస్ సెలబ్రేషన్స్ చేస్తూ ఉంటారు. ఇందులో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో క్రీస్తు ప్రేమ సువార్తిక సహవాసము (సిఎల్ఈఎఫ్) చర్చ్ వ్యవస్థాపకులు పాస్టర్ కె.నెహెమ్యా ఆధ్వర్యంలో స్థానిక చర్చ్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైజాగ్ నుంచి రెవరెండ్ వై.ఎలీషారాజు, పాస్టర్ సువర్ణరాజ్, పాస్టర్ పిలీఫ్‌లు పాల్గొని వేడుకలో భాగంగా కేక్ కట్ చేసి తీపిని పంచుకొని క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా రెవరెండ్ ఎలీషారాజు దేవుని వర్తమానం అందించారు. పాస్టర్ కే.నెహెమ్యా మాట్లాడుతూ క్రిస్మస్ సందర్భంగా ప్రతి సంవత్సరం మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకుంటామని ఈ సంవత్సరం కూడా ముందుగానే క్రిస్మస్ వేడుకలు ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు లకే చిట్టమ్మ, తాటికొండ పౌలు, ఎం.భాస్కర్‌రావు, ఐ.జోసెఫ్ రాజు పాల్గొన్నారు.

ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ



విశాలాంధ్ర - మారేడుమిల్లి: ఈనెల 12, 13వ తేదీల్లో నరసరావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి 67వ స్కూల్ గేమ్స్‌లో మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినిలు మడకం నాగలక్ష్మి అండర్ 19 విభాగంలో జావలిన్ త్రో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. అదేవిధంగా అండర్ 17 విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో విందెల మౌనిక తృతీయస్థానం కైవసం చేసుకుంది. వ్యాయామ ఉపాధ్యాయుడు దూడ ప్రమోద్‌ని ప్రిన్సిపాల్ అరుణ కుమారి అభినందించారు.

అమేజాన్ ఫ్యాషన్ వింటర్ స్టోర్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: శీతాకాలం ఫ్యాషన్ సౌందర్య అవసరాలు గురించి శ్రద్ధ వహించడానికి అమేజాన్ ఫ్యాషన్ తమ వింటర్ స్టోర్ దుస్తులు, సౌందర్యం శీతాకాలానికి కావలసిన ఇతర వస్తువులకు చెందిన ప్రముఖ బ్రాండ్స్‌తో సిద్ధంగా ఉంది. 'హర్ వల్ ఫ్యాషన్ బుల్‌గా ఉండండి మరియు శీతాకాలం మాయిశ్చరైజర్స్ విస్తృత శ్రేణి స్టైలిష్ హుడీస్, స్వెట్ షర్ట్స్, జాకెట్స్, మఫ్లర్స్, గ్లోవ్స్, బూట్స్, ఇంకా ఎన్నో వాటి నుండి ఎంచుకోండి. అమెజాన్ ఫ్యాషన్ స్టోర్‌లో స్టైల్, సౌకర్యం యొక్క ఆదర్శవంతమైన మిశ్రమాన్ని జోడించడానికి సీజన్ లో కొన్ని ప్రముఖ ఎంపికలు ఉన్నాయి.

బూడిద లారీ బోల్తా: తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర - పరవాడ: ఫ్లయాష్ లోడుతో వెళ్తున్న భారీ వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటన మండలంలోని పెదముషిడివాడ మలుపు వద్ద గురువారం అర్ధరాత్రి సమయంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్టీపీసీ యాష్ పాండు నుంచి బూడిదను లోడు చేసుకుని సబ్బవరం వైపు వెళ్తుండగా పెదముసిడివాడ సచివాలయం ఎదురుగా రహదారి మలుపు వద్ద ఆ భారీ వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో అక్కడ జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉంటే గ్రామాల మధ్యలో నుంచి ఫ్లయాష్ బూడిదను తరలిస్తున్న భారీ వాహనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పెదముసిడివాడ, లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం, పెట్టవానిపాలెం గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిమితికి మించిన లోడుతో రాకపోకలు సాగించడమే కాకుండా రోడ్లపై బూడిదను రాల్చు కుంటు వెళ్లడంతో తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. పరిమితికి మించి బూడిద లోడుతో రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలపై సంబంధిత శాఖాధికారులు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎండియు ఆపరేటర్‌ను తక్షణమే తొలగించాలి

విశాలాంధ్ర - జీకేవీధి: జీకేవీధి మండలం గాలికొండ పంచాయతీ ఎండియు ఆపరేటర్‌ను తక్షణమే తొలగించాలని స్థానిక ఎం పిటిసి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ గాలికొండ పంచాయతీ పరిధిలోని రెండు డిఆర్ డిపోలు ఉన్నాయని, వీటికి సంబంధించి ఎండియుగా దుర్గా గోవింద్‌ని ప్రభుత్వం నియమించిందని, కాని ఎండియు గోవింద్ ఆయా గ్రామాల రేషన్ కార్డులు లబ్దిదారులకు ప్రారంభం నుంచి ఏ నెల కూడా సక్రమంగా రేషన్ ఇవ్వడం లేదన్నారు. సివిల్ సప్లై డిటి జోక్యం చేసుకొని గొవింద్ తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కృష్ణ, హిర్మియ పాల్గన్నారు.

రియల్‌మీ కొత్త ఫోన్ సీ67 5జీ విడుదల

విశాలాంధ్ర/విశాఖపట్నం: అత్యంత విశ్వసనీయ స్మార్ట్‌ఫోన్ సర్వీస్ ప్రొవైడర్ అయిన రియల్‌మీ తాజాగా తన ఛాంపియన్ సిరీస్‌లో మొద టి 5జీ స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. రియల్‌మీ సీ67 5జీని మార్కె ట్‌లోకి పంపించింది. రియల్‌మీ సీ67 5జీ, 5జీ ఛార్జింట్ ఛాంపియన్ 5జీ కనెక్టివిటీతో వస్తుంది. శక్తివంతమైన కెమెరా, ఫాస్ట్ ఛార్జింగ్, భారీ బ్యాటరీ, ఆకర్షణీయమైన డిజైన్, శక్తివంతమైన 5జీ చిప్‌సెట్, మల్టీ టాస్కింగ్‌కు తగిన ర్యామ్, ఉదారమైన నిల్వ సామర్థ్యాన్ని మిళితం చేస్తుంది. రియల్‌మీ సీ67 5జీ యువ వినియోగదారులకు గొప్ప ప్రైస్‌కు అద్భుతమైన ప్రొడక్ట్ అనుభవాన్ని అందించడం లక్ష్యంగా పెట్టు కుంది. సీ67 5జీ శక్తివంతమైన 50ఎంపీ ఏఐ కెమెరాతో వస్తుంది. ఇది వినియోగదారుల సృజనాత్మకత, ఫోటోగ్రఫీని ప్రదర్శించడానికి అనుమతినిస్తుంది. సీ67 5జీలో ఎఫ్‌హెచ్‌డీ డిస్‌ప్లేతో 120 హెచ్‌జెడ్ అల్ట్రా స్మూత్ డిస్‌ప్లే, 91.4 స్క్రీన్ టు బాడీ రేషియో వున్నాయి.

వెన్నెముక ఆరోగ్య సంరక్షణలో అపోలో వైద్యసేవలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఉత్తర ఆంధ్ర ప్రాంతంలో వెన్నెముక ఆరోగ్య సంరక్షణలో అద్భుతమైన పురోగతిని సూచిస్తూ యూబీ ఈ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ మినిమల్లీ ఇన్వాసివ్ స్పైన్ సర్జరీని విశాఖపట్నం అపోలో ఆసుపత్రిలో ప్రారంభించినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. యుబీ ఈ ఎండోస్కోపిక్ వెన్నెముక శస్త్రచికిత్స వేగవంతమైన రికవరీ సమయం, కనిష్ట మచ్చలు, కండరాల నష్టం లేకపోవడం, అతితక్కువ రక్త నష్టం, కుట్టులేని పద్ధతులు, కనిష్ట ఎముక తొలగింపు సేవలను అపోలో ఆసుపత్రి అందిస్తున్నాయన్నారు. సాధ్యమైనంత ఉత్తమమైన ఫలితాలను అందించడంలో మా నిబద్ధతను తెలియజేస్తుందని. వైద్య నిపుణులు డాక్టర్ ఎం. సతీష్, డాక్టర్ సతీష్ రాజు, డాక్టర్ బాలకృష్ణ తదితరులు వెల్లడించారు.

కారు బోల్తా

విశాలాంధ్ర - మారేడుమిల్లి: మండలంలోని దేవరపల్లి సున్నంపాడు గ్రామాల మధ్య రామన్న వలస జంక్షన్ సమీపంలో శుక్రవారం ఉదయం ఓ కారు ప్రమాదానికి గురైంది. మారేడుమిల్లి టూరిజానికి వచ్చి తిరిగి ప్రయాణంలో సున్నంపాడు గ్రామ సమీపం రామన్న వలస జంక్షన్ వద్ద శుక్రవారం కారు టైర్ పంచర్ అయ్యి రోడ్డు పక్కన ఉన్న కరెంటు స్తంభానికి ఢీకొంది. స్తంభం విరిగి కారుపై పడటంతో కారు పూర్తిగా ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ ఎమ్మెల్యే తనయుడు

విశాలాంధ్ర - పాయకరావుపేట: పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే మారుతి ఆదియ్య తనయుడు మారుతి నారాయణ చక్రవర్తి కాంగ్రెస్ పార్టీలో చేరారు. విజయవాడలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జగతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన మారుతి నారాయణ చక్రవర్తిని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. నారాయణ చక్రవర్తి సెంట్రల్ ఇన్‌డస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌లో అసిస్టెంటు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి ఇటీవల రిటైర్ అయ్యారు. నారాయణ చక్రవర్తి పార్టీలో చేరడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర - ఎటపాక: తుఫాన్‌కు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణం పరిహారం అందించి ఆదుకోవాలని నష్ట పోయిన మిర్చి రైతులకు ఎకరానికి 50వేల రూపాయలు ఇవ్వాలని తెలుగు యువత మండల అధ్యక్షులు నాలజాల మధు డిమాండ్ చేశారు. తుపాను వల్ల వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని అన్నదాతలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టాల నమోదుకు ప్రభుత్వం తగు ఆదేశాలివ్వాలని కోరారు. ఎకరాకు రూ.50 వేలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తడిసిన రంగు మారిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలని కోరారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని సీతంపేట గ్రామంలో శుక్రవారం ముత్యాల చిన్న వెంకటేశ్వర్లుకు చెందిన ఇల్లు అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో భయాందోళన చెందారు. స్థానిక ఇన్చార్జ్ యస్ఐ వెంకటేష్ ఫైర్ ఇంజన్‌తో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ సంఘటనలో పూరిల్లు దగ్ధం అవగా భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. వైసీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు పార్టీ సభ్యుల ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలను పరామర్శించి, ఎమ్మెల్యే ధనలక్ష్మి ఎం ఎల్ సి అనంత బాబు సహాయ సహకారాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి రెండు టార్పాలిన్సు నిత్యవసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో ముత్యాల గౌతం, ప్రభాకర్, కే వెంకటేశ్వర్లు, ఎన్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఓక్రిడ్జ్‌లో వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - భీమిలి: ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూలులో 15వ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. బి.మహేశ్వర దాస్, శాఖాధిపతి, డిపార్టుమెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ వారు విజువల్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి సందర్శకులకు కనువిందు చేసారు. ఈ వార్షికోత్సవ వేడుకలలో జూ క్యూరేటర్ నందిని సలారియా పాల్గొన్నారు. భారతీయ సంస్కృతికి సంబంధించిన అనేక సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా విద్యార్థులు కనపరచిన ప్రతిభను ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శైలా భమిడిపాటి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ సంతృప్తికరం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ సంతృప్తికరంగా ఉందని, నిబంధనల మేరకు సాగిందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ ఆనంద్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ తనిఖీ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం అండర్ సెక్రటరీ లవ్ కుష్ యాదవ్ తో కలిసి శుక్రవారం నగరంలో ఆయన పర్యటించారు. అందులో భాగంగా విశాఖ పశ్చిమ, దక్షిణ శాసనసభ నియోజక వర్గాల పరిధిలో ఓటర్ల నుండి స్వీకరించిన ఫారం 6,7,8లను, ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ఫారాలను సూర్యాభాగ్‌లోని జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో తనిఖీ చేశారు. సమగ్ర వివరాలతో కూడిన కొన్ని ఫారాలు మినహా మిగిలిన ఫారాలన్నీ సంతృప్తికరంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఎటువంటి ఫిర్యాదులు తలెత్తకుండా ఉండేలా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పక్కాగా ఉండాలని, ఆ దిశగా బి.ఎల్.ఓలు పనిచేయాలని కోరారు. అనంతరం స్థానిక వెంకటేశ్వర మెట్ట (డాబాగార్డెన్స్)లో గల జి.వి.యం.సి మహాత్మాగాంధీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ స్టేషన్ 71,72లను జాయింట్ కలెక్టర్ కె.యస్.విశ్వనాథన్‌తో కలిసి పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం అండర్ సెక్రటరీ లవ్ కుష్ యాదవ్, స్థానిక ఈ.ఆర్.ఓలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.యస్.విశ్వనాథన్, ఈ.ఆర్.ఓలు హుస్సేన్ సాహెబ్, సీతారామ మూర్తి, ఎ.ఈ.ఆర్.ఓ లు, బి.ఎల్.ఓలు తదితరులు ఉన్నారు.

శ్రమించిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం

విశాలాంధ్ర - చింతపల్లి: వైకాపా మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవికి వైకాపా అల్లూరి జిల్లా అధ్యక్షురాలు పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సహ పలువురు ప్రజా ప్రతినిధులు దుస్సాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో శ్రమించిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం లభిస్తుందనడానికి అనూష దేవి ని ఉదాహరణగా తీసుకోవచ్చు అన్నారు. చిన్న వయసులోనే ఎంపీపీ పదవిని అధిష్టించిన అనూష దేవిని వైకాపా అధిష్టానం గుర్తించి మహిళా విభాగంలో రాష్ట్ర కార్యదర్శిగా నియమించడం సంతోషించదగ్గ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి, చింతపల్లి సర్పంచ్ పుష్పలత, ఎంపీటీసీ సభ్యురాలు దాసరి ధారలక్ష్మి, చిందాడ జయలక్ష్మి, జీకేవిటి ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షల సహాయాన్ని అందించిన టీవీఎస్ మోటర్ కంపెనీ

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశంలోని మూడవ అతిపెద్ద ద్విచక్ర వాహన సంస్థ టీవీఎస్ మోటర్ కంపెనీ ఆంధ్రప్రదేశ్‌లో విపత్తు సహాయక చర్యలకు రూ.50 లక్షల విరాళాన్ని అందించింది. ఈ చురుకైన చర్య కార్పొరేట్ సామాజిక బాధ్యత పట్ల కంపెనీ యొక్క అచంచలమైన అంకితభావాన్ని మరియు సంక్షోభ సమయాల్లో కమ్యూనిటీలకు మద్దతు ఇవ్వడానికి దాని నిబద్ధతను నొక్కి చెబుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల సంభవించిన విపత్తు వల్ల ప్రతికూలంగా ప్రభావితమైన వారికి తక్షణ సహాయం మరియు పునరావాసం అందించడానికి ఈ నిధులు వినియోగించబడతాయని టీవీఎస్ మోటర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సుదర్శన్ వేణు తెలిపారు

ఆశా, అంగన్వాడీల మానవహారం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: గత రెండు రోజులు పాటు ఆశా వర్కర్స్ తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలని శాంతియుతంగా ధర్నా చేపడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను పెట్టి అక్రమంగా అరెస్టులు చేయించడాన్ని నిరశిస్తూ జివిఎంసి గాంధీవిగ్రహం వద్ద సాయంత్రం 4 గంటలకు మానవహారం చేపట్టింది. ఈ సందర్భంగా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ శుక్రవారం తెల్లవారి 7 గంటలకే పోలీసులు ధర్నావద్దకు వచ్చి ఆశా కార్మికులను అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ , హెల్పర్స్ గత 5రోజులుగా ఐక్యంగా సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చేయడానికి సిద్దపడకపోగా అంగన్‌వాడీ కేంద్రాలకు సచివాలయం సిబ్బందిని పంపించి తాళాలు పగలగొట్టి అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించడాన్ని తప్పుపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, ఆశా, అంగన్ వాడీ నాయకులు పి.మణి, బి.జగన్, ఎం.సుబ్బారావు, మేరి, పద్మ, తులసి, పోలేశ్వరరావు, టి.నూక రాజు, యు.రాజు, అప్పలరాజు, ఎన్.ప్రకాశరావు, పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగూడ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె శుక్రవారానికి నాల్గో రోజుకు చేరుకుంది. ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆ సంఘం మండల అధ్యక్షురాలు కొండమ్మ మాట్లాడారు. అంగన్వాడీ న్యాయమైన సమ

స్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం జాప్యం చేయడం విచారకరమన్నారు. అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. ఆ సంఘం నాయకురాలు సత్యవతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వి.మాడుగుల: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మాడుగులలో అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం నాల్గో రోజుకు చేరింది. ఈ సందర్భంగా మాడుగుల ప్రాజెక్ట్ యూనియన్ నాయకులు మేడపురెడ్డి జానకి, బేతా భాగ్యలక్ష్మి

మాట్లాడుతూ దేశంలో మాతృ మరణాలు, శిశు మరణాలు తగ్గించడానికి, పోషకాహారాన్ని అందించటానికి పిల్లల సమగ్ర అభివృద్ధి పథకం (ఐసిడిఎస్) మంచిగా కృషి చేస్తుందన్నారు. అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు గిరిజన సంఘం, సిఐటియు నాయకులు ఇరట నరసింహమూర్తి, ఆర్.దేముడునాయుడు మద్దతు తెలిపారు. మద్దతు తెలియజేశారు.

పెందుర్తి : అంగన్వాడీల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించుకుంటే ఈ నెల 17 నుండి ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి షేక్ షఫీ ఉల్ల స్పష్టం చేశారు. పెందుర్తి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీలకు ఎన్నో హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి

అధికారంలోకి వచ్చాక మరిచిపోయారని ఎద్దేవా చేశారు. తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు అదనంగా వేతనం చెల్లిస్తానన్న హామీ ఏమైంది అని ఆయన ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, కనీస వేతనం, పెన్షన్, అలవెన్సులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని షఫీ డిమాండ్ చేశారు.

పాయకరావుపేట: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగనవాడీ కార్యకర్తలు

పాయకరావుపేటలో భారీ ర్యాలీ నిర్వహించారు. వీరు చేపట్టిన ర్యాలీకి టిడిపి, జనసేన, సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. ఈకార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షులు పెదిరెడ్డి శ్రీను, బొంది కాశీవిశ్వనాధ్, పెదిరెడ్డి నాగ వెంకటరమణ, పల్లా విలియంకేరి, జూరెడ్డి ప్రసాద్, మలిపెద్ది వెంకటరమణ, గుల్లా నాగరాజు, రాజాన ఆది, బోడపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే రైతు సంఘం నాయకులు ఎం.అప్పలరాజు, సిఐటియు నాయకులు జి.కోటేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, ఆర్.రాము, యూనియన్ నాయకులు ఎం.దుర్గారాణి, బి.సుబ్బలక్ష్మి, కాకర నూకరత్నం, ఫణి, సత్యవేణి, కవిత, భవాని తదితరులు పాల్గొన్నారు.

జీకేవీధి: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం సమ్మెలో భాగంగా తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోగా గ్రామ వాలంటీర్లు, పోలీసులు చేత అంగన్వాడి సెంటర్ల తాళాలు బలవంతంగా లాక్కునే ప్రయత్నం విరమించుకోవాలన్నారు. సీఎం జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు ఎల్.సత్యవతి, ఎస్.అప్పలనర్స, జి.దయ, వెంకటి, జ్యోతి, భవాని, యశోద కుమారి, బోడే వనేశ్వరి, మేరీ చిరంజీవి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

చిన్న వ్యాపారులకు వ్యాపార అవకాశాలు విస్తరణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: మీషో ఈనాడు భారతదేశంలో అసలుసిసలైన ఇ-కామర్స్ మార్కెట్ వేదిక. లక్షలాది మంది చిన్న వ్యాపారులకు వ్యాపార అవకాశాలను విస్తరిస్తున్నది. మీషో అక్టోబర్-2023 నుంచి కేవలం రెండు నెలల కాలంలో సుమారు 25,000 మంది నాన్-విక్రేతలను చేర్చుకోవటం జరిగినది. ఈ సంవత్సర ఆరంభంలో మీషో అనేక సాంకేతికతలను అందిపుచ్చుకుని అమలుచేయటం వలన, 1 అక్టోబర్ 2023 నుండి మీషో వేదిక ద్వారా విక్రయాలకు నాన్-జీఎస్టీ విక్రేతలకు మార్గం సుగమం అయింది. గడచిన రెండు నెలలు కాలంలో ఆంధ్రప్రదేశ్, అస్సాం, బీహార్, పంజాబ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ వంటి 20 రాష్ట్రాల మీషో లో కొత్తగా విక్రేతలు వృద్ధి చెందారు

జీ తెలుగు ఓంకారం ఆధ్యాత్మిక ప్రయాణం పదేళ్లు పూర్తి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: తెలుగు ఇండస్ట్రీలో అత్యంత వినోదాత్మక ఛానల్స్‌లో ఒకటైన జీ తెలుగు ఎప్పుడూ విలక్షణమైన ఫిక్షన్, నాన్ ఫిక్షన్ షోలు, బ్లాక్ బస్టర్ సినిమాలు, ఆధ్యాత్మిక, భక్తి కార్యక్రమాలతో ముందుంటుంది. జీ తెలుగు అత్యంత ప్రసిద్ధ ఆధ్యాత్మిక, భక్తి కార్యక్రమాలలో ఒకటైన ఓంకారం విజయవంతంగా పదేళ్లు పూర్తి చేసుకుంది. ప్రేక్షకుల్లో భక్తిభావం నింపే ఓంకారం ప్రతిరోజు ఉదయం 8 గంటలకు, మీ జీ తెలుగులో! 2003 డిసెంబర్ 12న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో దేవిశ్రీ గురూజీ భక్తులకు ఆధ్యాత్మిక సమాచారాన్ని అందిస్తున్నారు.

కొనసాగుతున్న తపాలా ఉద్యోగుల సమ్మె

విశాలాంధ్ర - ఎటపాక: తమ సమస్యల పరిష్కారం కోసం గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె నాలుగో రోజుకు చేరింది. నెల్లిపాక తపాలా కార్యాలయం ఎదుట గ్రామీణ తపాలా ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం కేంద్ర సంఘాలు ప్రయత్నిస్తున్నప్పటికీ డిమాండ్లు నెరవేర్చే సూచనలు కనపడటం లేదన్నారు. అందుకే ఉద్యోగులు నిరవధిక సమ్మె చేయాలని జీడీఎస్, పీజేసీఏ నిర్ణయించి సమ్మెలోకి వెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐజిడిఎస్యు నాయకులు జి. హరినాద్, సిహెచ్చి శ్రీనివాసరావు, నెల్లిపాక, తోటపల్లి ఎస్ఓలు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు వర్ధంతి

విశాలాంధ్ర - ఆనందపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలను ఎంపీడీఓ అడపా లవరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అడపా లవరాజు, ఈవోపీఆర్డీ రామారావు, పిన్నింటి వెంకటరమణ, ప్రజాప్రతినిధులు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరం: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో చోడవరం

ఆర్యవైశ్య సంఘ భవనం (చిన్న సత్రం) దగ్గర ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి శుక్ర వారం పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్యవైశ్య సంఘ భవనం చైర్మన్ కొల్లూరు మంగరాజు విచ్చేశి మాట్లాడుతూ నాడు శ్రీరాములు కృషితో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ క్లబ్ అధ్యక్షుడు కొల్లూరు మణికుమార్, కార్యదర్శి కేతవరపు రామకృష్ణ, కోశాధికారి పూసర్ల కిరణ్, యూత్ క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ సత్యవరపు శ్రీనివాసరావు, క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్స్ మరియు క్లబ్ డైరెక్టర్స్, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక



విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని పెంటకోట గ్రామంలో జనసేన నాయకులు గెడ్డం బుజ్జి సమక్షంలో పలువురు కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. ఈసందర్భంగా గ్రామంలో పార్టీ జెండా ఎగుర వేశారు. ఈసందర్భంగా గెడ్డం బుజ్జి పార్టీలో చేరిన కార్యకర్తలను కండువా వేసి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి, టిడిపి నాయకులు చిక్కాల శ్రీను, జనసేన నాయకులు నారపురెడ్డి పద్మావతి, కట్టా దొర, జగ్గన్నదొర, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మాతే



విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలంలోని కె.కోడాపల్లి పంచాయితీకి చెందిన బందవీధి గ్రామానికి చెందిన మాతే వెంకట రమణ వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. స్థానిక ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మికి, వైసీపీ నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

60 మందికి ఉచిత వైద్య సేవలు

విశాలాంధ్ర - దేవీపట్నం: శ్రీ రామకృష్ణ గిరిజన సంచార వైద్య శాల రాజమహేంద్రవరం వారిచే శుక్రవారం దేవిపట్నం మండలం పోతవరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించినట్లు రామ కృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానంద మహరాజ్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 60 మంది రోగులకు డాక్టర్ రాయుడు శ్రీనివాస్ వైద్య సేవలు అందించి అవసరమైన 32 ఉచిత రక్త పరీక్షలు చేసినట్లు స్వామీజీ తెలిపారు. ఈ వైద్య శిబిరం లో డాక్టర్ రాయుడు శ్రీనివాస్, రామ కృష్ణ మిషన్ కో-ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమిత్వ పథకం ద్వారా సంపూర్ణ గృహ హక్కును ప్రతి ఒక్కరూ పొందాలి

విశాలాంధ్ర - రావికమతం : సమిత్వ పథకం ద్వారా సంపూర్ణ గృహ హక్కును ప్రతి ఒక్కరూ పొందాలని సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు అన్నారు. మండలంలో కౌగుంట పంచాయతీ శివారు బుడ్డిబంద గ్రామంలో కమ్యూనిటీ వారి వద్ద సమిత్వ గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జగనన్న భుహక్కు భూ రక్ష పథకం ద్వారా సర్వే ఎలా జరిగిందో అదే విధంగా గ్రామంలో ఒక ఐడి నెంబర్ ప్రకారం ప్రతి ఇంటికి హక్కు ప్రభుత్వం అక్కుపత్రాలను అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది అన్నారు. కాబట్టి గ్రామంలో బంజరు, పోరంబోకు, గ్రామకంతం భూములలో గృహాలు నిర్మించు కున్న వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వే యంత్రాంగం అన్ని ఇళ్లను గుర్తించడం జరిగిందన్నారు. వాటి వివరాలను గ్రామసభలో చదివి వినిపించడం జరిగిందని తెలిపారు. అర్హత ఉండి ఏ ఒక్కరైనా సమిత్వాలో చేరకపోయినట్లు అయితే అటువంటి వారిని గుర్తించి వారికి కూడా హక్కు పత్రాలు అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అలాగే పంచాయతీ కార్యదర్శి ఎస్. ఏ స్వామి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ సమీత్వా పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తద్వారా మన ఇళ్లకు హక్కు పత్రాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అయితే విలేజ్ మ్యాప్ ఆధారంగా వీటి సర్వే ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పలువురు పాల్గొన్నారు.. సమిత్వ పథకం ద్వారా సంపూర్ణ గృహ హక్కును ప్రతి ఒక్కరూ పొందాలని సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు అన్నారు. మండలంలో కౌగుంట పంచాయతీ శివారు బుడ్డిబంద గ్రామంలో కమ్యూనిటీ వారి వద్ద సమిత్వ గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జగనన్న భుహక్కు భూ రక్ష పథకం ద్వారా సర్వే ఎలా జరిగిందో అదే విధంగా గ్రామంలో ఒక ఐడి నెంబర్ ప్రకారం ప్రతి ఇంటికి హక్కు ప్రభుత్వం అక్కుపత్రాలను అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది అన్నారు. అలాగే పంచాయతీ కార్యదర్శి ఎస్.ఏ స్వామి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ సమీత్వా పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తద్వారా మన ఇళ్లకు హక్కు పత్రాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అయితే విలేజ్ మ్యాప్ ఆధారంగా వీటి సర్వే ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పలువురు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్వాడి కార్మికుల ఆందోళన

విశాలాంధ్ర - అరకులోయ : అంగన్వాడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేపడుతున్న ఆందోళనలు మండలంలో కొనసాగుతున్నాయి. శుక్రవారం నాలుగో రోజు స్థానిక మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద టెంట్లు ఏర్పాటు చేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తక్షణమే సమస్య పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన ధృతం చేపడతామని పెద్ద ఎత్తున కార్మికులు నినాదాలు చేశారు. ఇచ్చిన ఆమె న్యాయమైన సమస్యను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేపడుతున్న సమ్మెలో అనంతగిరి మండల జడ్పీటిసి పాల్గొని సంఘీభావాన్ని తెలియపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమైన సమస్యలపై పోరాడుతున్న అంగనివడి కార్యకర్తల సమస్యలు తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన కోరారు. సమస్యలు పరిష్కారం చేయకుండా అంగన్వాడీల సమ్మె చేయడానికి ప్రభుత్వం పూనుకుంటూ అంగన్వాడి కేంద్రాల్లో మండల అధికారులు వెళ్లి సెంటర్లో తాళాలు పగలగొట్టి ఐకెపి సచివాలయ వాలంటీర్స్ సిబ్బందితో నిర్వహించే ప్రయత్నం మానుకోవాలని చెప్పారు. కనీస వేతనము రూ 26 వేల రూపాయలు ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాడ్యుటీ అమలు చేయాలని చెప్పారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు నాగమ్మ మాట్లాడుతూ ప్రస్తుత ధరలకు అనుగుణంగా అంగన్వాడీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేపడతామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల నాయకులు నిర్మల, లక్ష్మి, అంగన్వాడి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మా సచివాలయం విధులు ఎక్కడ

కోనాపురం సర్పంచ్ ఆవేదన

విశాలాంధ్ర - అనంతగిరి : రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాల ఏర్పాటు చేసి ప్రజల వద్దకు పాలన అన్నట్టు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది అయితే కొన్ని గ్రామపంచాయతీలను వెనక పెట్టి కొన్ని పంచాయతీలు మాత్రమే సచివాలయాలుగా మార్పు చేశారు ఇందులో భాగంగా సచివాలయాలకు 11 మంది సిబ్బందిని నియమించారు అల్లూరి జిల్లా అనంతగిరి మండలం లో 24 పంచాయతీలకు గాను 21 సచివాలయ లాగా ఏర్పాటు చేశారు మిగిలిన మూడు పంచాయతీలు పక్క పంచాయతీలో ఏర్పాటు చేసిన సచివాలయంలో కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉంటది ఇందులో భాగంగా 10 గ్రామాలు కలిగిన 3350 జనాభా ఉన్న 1400 ఓటర్లు కలిగిన కోనాపురం పంచాయతీని బొర్రా సచివాలంలోకి విలీనం చేశారు. వీటితోపాటు అనంతగిరి మండలంలో మరో రెండు పంచాయతీలను విలినం చేశారు అయితే ఖానాపురం తో పాటు రెండు పంచాయతీలకు సర్పంచులు రాజ్యాంగ బద్ధంగా ఎన్నికయ్యారు అయితే పంచాయితీ లో అధికారిక సిబ్బంది లేకపోవడం వల్ల ఈ మూడు పంచాయతీలు విధులు పక్క పంచాయతీ సిబ్బందితో నిర్వహించుకోవలసి వస్తుంది. కనీసం సర్పంచ్ అయినందున ఆ సచివాలయంలో చాంబర్ కూడా ఏర్పాటు చేయకపోవడం వలన ఉత్సవ విగ్రహాల ఉన్నామని కోనాపురం సర్పంచ్ దుబాయ్ అప్పలమ్మ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ, వాలంటరీల వ్యవస్థలు వచ్చినప్పటినుంచి సచివాలయం లేని సర్పంచులు పరిస్థితి మరీ ఉత్సవ విగ్రహాల్లా ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ విధమైన ప్రణాళికలు వేసి మా పంచాయతీలకు సచివాలయం ఏర్పాటు ఎందుకు చేయలేదో ప్రజలకు తెలిసే విధంగా బహిరంగంగా అధికారులు తెలియపరచాలని కోరారు. అలాగే ప్రజలచే ప్రజల కొరకు ఎన్నికై సర్పంచ్ అనిపించుకోవడం తప్ప పంచాయతీకి మేము ఏమి చేయలేకపోతున్నాము అనే ఆవేదన ఎక్కువైందని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సర్పంచి ఉన్నచోట సచివాలయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన అధికార సిబ్బంది లేకపోవడంతో ప్రజలకు ఏ విధమైన మేలు చేయలేని పరిస్థితి ఏర్పడిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

చంద్రబాబును కలిసిన పోశమ్మ ...

టిడిపి టికెట్‌కు ప్రయత్నాలు

విశాలాంధ్ర - దేవీపట్నం : రంప చోడవరం నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలుగా క్రియాశీల నాయకురాలుగా తన అత్తింటి కుటుంబం ఎన్నో ఏండ్లుగా తెలుగు దేశం కుటుంబంలో క్రియాశీలకంగా పంచాయితీ సర్పంచ్ లుగా ఒకప్పటి మండల వ్యవస్థ నుంచి స్వర్గీయ నందమూరి తారక రామారావు టిడిపి పార్టీని స్థాపించిన నాటి నుంచి నేటి వరకు టిడిపి పార్టీలో ఉంటూ వచ్చిన కుటుంబంలోని సభ్యురాలుగా ఉన్న కారం పోశమ్మ శుక్రవారం అమరావతి టిడిపి పార్టీ కార్యాలయంలో కార్యాలయంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలిసి నియోజక వర్గ రాజకీయ పరిస్థితులను వివరించారు . తూర్పు ఏజన్సీ లో బలమైన కోయదొర సామాజిక వర్గం నుంచి రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి వచ్చిన మహిళగా తనకు ఉన్న అనుభవాలను పరిచయాలను బాబుకు వివరించినట్టు తెలిపారు . ఆసక్తిగా విన్న ఆయన పార్టీ ఏ నిర్ణయం తీసుకున్న గెలుపే ధ్యేయంగా పనిచేయాలని సూచించినట్టు ఆమె పెర్కొన్నారు . ఆమె వెంట టిడిపి సీనియర్ నాయకులు ఉన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మృతి పట్ల యూటిఎఫ్ సంతాపం

విశాలాంధ్ర - గంగవరం : ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ కారు ప్రమాదంలో అకాల మరణం పొందడం పట్ల అల్లూరి సీతారామరాజు జిల్లా యుటిఎఫ్ కోశాధికారి కోసు కృష్ణ మరియు ఉపాధ్యాయులు, యుటిఎఫ్ సభ్యులు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా కోసు కృష్ణ దొర మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్ల సమ్మె ధర్నా కార్యక్రమానికి సంఘీభావం తెలిపేందుకు వెళుతున్న ఆయన కారు ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. గత పది రోజుల క్రితం గిరిజన ప్రాంతంలోని గంగవరం మండలంలో పలు ఆశ్రమ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని రాష్ట్రస్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇవ్వడం జరిగిందని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి చెందిన వార్త విన్న ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదనకు గురి అయ్యారన్నారు. ఎమ్మెల్సీ అయిన నాటినుండి ఉద్యోగ, ఉపాధ్యాయ, కమిషనర్లు, కార్మికులు, ప్రజా సమస్యల కారమే ధ్యేయంగా పనిచేశారన్నారు. శాసనమండలిలో ఆయన చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నామన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తపాలా శాఖ ఉద్యోగులకు బీజేపీ, టీడీపీ నాయకుల మద్దతు

చింతూరు - విశాలాంధ్ర : అఖిలభారత తపాల శాఖ ఉద్యోగుల యూనియన్ పిలుపుమేరకు, తమ కోరికల సాధనకు చింతూరు సబ్ డివిజన్లోని గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగుల సమ్మె నాలుగో రోజుకు చేరుకుంది. వీరికి మండల తెలుగుదేశం అధ్యక్షులు ఇల్లా చిన్నారెడ్డి, బిజెపి మండల కన్వీనర్ డి వి యస్ యస్ యన్ రమణారెడ్డి (చిట్టిబాబు) జనసేన పార్టీ మండల అధ్యక్షులు మడివి రాజు శుక్రవారం మద్దతు తెలిపారు. వారి సమస్యల పోరాటానికి తమ పార్టీల తరపున సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతూరు సబ్ డివిజన్ అల్లి శ్రీనివాసరావు శీను బాబు (గోర్లగూడెం) పులి. వెంకట్ నారాయణ, సత్యనారాయణ రెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

పదోన్నతిపై సీఐ బదిలీ

విశాలాంధ్ర - కే కోటపాడు : స్థానిక సీఐ ఎస్ తాతారావు పదోన్నతిపై విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ డీఎస్పీగా విశాఖలో బాధ్యతలు స్వీకరించారు. 1996 బ్యాచ్‌కి చెందిన తాతారావు విశాఖ రేంజ్ పరిధిలో పలు స్టేషన్లలో విధులు నిర్వహించారు. కే కోటపాడు పోలీస్ సర్కిల్ కార్యాలయంలో మొట్ట మొదటి సిఐగా బాధ్యతలు స్వీకరించి వివాద రహితుడుగా మంచి పేరు సంపాదించారు. ఈయన పదోన్నతిపై బదిలీ కావడంతో పలువురు శుభాకాంక్షలు అందజేశారు.

అంగన్వాడి వర్కర్‌లకు అండగా ఉంటాం : జనసేన

విశాలాంధ్ర - కే.కోటపాడు : రాష్ట్ర వ్యాప్తంగా గత నాలుగు రోజులుగా అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సమస్యల కోసం చేపడుతున్న నిరసన దీక్షకు మద్దతుగా శుక్రవారం జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు మాడుగుల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త రాయిపురెడ్డి కృష్ణ కే కోటపాడు ఐసిడిఎస్ కార్యాలయము వద్ద చేపడుతున్న నిరసనలో పాల్గొని తమ మద్దతు తెలియచేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 52వేల అంగన్వాడీ కేంద్రాల్లో సుమారు లక్ష మందికి పైగా అంగన్వాడీ వర్కర్లు నామమాత్రపు వేతనాలకే పనిచేస్తున్నారు. వీరందరికీ కూడా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు గ్రాట్యుటి వీరికి కల్పించాలని జనసేన పార్టీ వీరికి సంపూర్ణ మద్దతు తెలుపుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన నాయకులు కుంచా అంజి బాబు చుక్కా నారాయణ మూర్తి భీమవరం రాము శ్రీను గణేష్ శివ కడుపొట్ల గంగు నాయుడు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్నాళ్లు మోసం చేసి.. ఆడింది చాలదా సీఎం గారూ..!

ఆడుదాం ఆంధ్రాపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఎద్దేవా

విశాలాంధ్ర - భీమిలి : వైకాపా అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ల నుండి రాష్ట్ర ప్రజలతో ఆడింది చాలదు అన్నట్లు ఇప్పుడు కొత్తగా ఆడుదాం ఆంధ్ర అంటూ కొత్త నాటకం మొదలుపెట్టారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పెందుర్తి నియోజకవర్గం పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గంటా నూకరాజు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై స్పందించారు. ఇన్నాళ్లు అన్ని వర్గాల ప్రజలతో ఆడిన ఆటలు చాలని ఇక ఆవండి మీ నాటకాలు అని అన్నారు. ఇసుక, సిమెంట్ ధరలు పెంచి బిల్డింగ్ కార్మికులతో ఆడుకున్నారని, నిత్యావసర ధరలు పెంచి సామాన్య ప్రజలతో ఆడుకున్నారని, వలలు, డీజిల్, తెప్పలకు సబ్సిడీ రుణాలు ఆపివేసి మత్స్యకారులతో ఆడుకున్నారని, డ్వాక్రా గ్రూప్ సభ్యులు దాచుకున్న ఇన్సూరెన్స్ డబ్బులు దోచుకొని వారితో ఆడుకున్నారని, జరిగిన పనులకు బిల్లులు చెల్లించక కాంట్రాక్టర్లతో ఆడుకున్నార, జాబ్ క్యాలెండర్ ఇస్తామని నిరుద్యోగులతో ఆడుకున్నారని, సీపీఎస్ రద్దు చేస్తామని ఉపాధ్యా యులతో ఆడుకున్నారని, జీతాలు కనీస వేతనం ఇస్తామని చెప్పి మోసం చేసి అంగన్వాడీ టీచర్స్ తో ఆడుకున్నారని, ఇంటి పన్నులు, కరెంటు బిల్లులు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి అన్ని వర్గాల ప్రజలతో ఈ నాలుగున్నరేళ్లుగా ఆడుకుంది చాలాదా..? ఇంకా ఆడుదాం ఆంధ్రా అంటూ కొత్త నాటకాలు ఎందుకని గంటా నూకరాజు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి అంగన్వాడిల నిరసన సెగ

విశాలాంధ్ర - చింతపల్లి : అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని గడిచిన నాలుగు రోజులుగా మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్వాడి యూనియన్ అధ్యక్షురాలు పెంటమ్మ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతున్న విషయం పాఠకులకు తెలిసిందే. ఇందులో భాగంగానే ఈనెల 21న చింతపల్లి పర్యటనకు విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటనకు సంబంధించి స్థలాన్ని పరిశీలించేందుకు చింతపల్లి వచ్చిన పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మికి అంగన్వాడి కార్యకర్తలు ఒక్కసారిగా నిరసన వ్యక్తం చేశారు. కనీస వేతనం 26 వేలు చేయాలని, యాప్ ల నుంచి మినహాయింపు ఇవ్వాలని, అంగన్వాడి కార్యకర్త మృతి చెందితే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, మృతి చెందిన కుటుంబానికి గ్రాట్యూటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని నినాదాలు చేస్తూ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని అడ్డుకున్నారు. న్యాయమైన డిమాండ్లకై పోరాడుతున్న అంగన్వాడి సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు అన్నారు. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి స్పందించి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చి అక్కడినుంచి వెళ్ళిపోయారు. ఆ హామీతో సంతృప్తి చెందని అంగన్వాడి కార్యకర్తల నాయకులు రాములమ్మ, అక్కమ్మ, వరలక్ష్మి, రాజేశ్వరి, తేజ, నాగరత్నం, కుమారి, జనసేన నాయకుడు కిలో రాజన్, సిఐటియు నాయకుడు ధనుంజయ్, చిరంజీవి, సింహాచలం, అధిక సంఖ్యలో అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల పోస్టర్ అవిష్కరణ

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ 91 వ వార్డు బాజీ జంక్షన్ 472 సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో భాగంగా పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆదారి ఆనంద్ కుమార్ ఆదేశాల మేరకు జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కర రావు పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసి పార్టీ జెండాను ఎగురవేశారు. జగనన్న ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ముందుగా సచివాలయం పరిధిలో వివిధ పథకాల కింద లబ్దిదారులకు మంజూరు చేసిన వివరాలకు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే జగన్మోహన్ రెడ్డి మరల ముఖ్యమంత్రిగా రావాలని ఆయన అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రాకముందు రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం ఏ విధంగా ఉందో ప్రజలు ఆలోచించాలన్నారు. ఈ సచివాలయానికి సంబంధించి వివిధ పథకాల కింద 14,36,43,583 రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు మరల ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు యధావిధిగా కొనసాగి రాష్ట్రం, మనం అన్ని విధాల అభివృద్ధి చెందుతామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కి జగన్ ఎందుకు కావాలంటే పశ్చిమ నియోజకవర్గానికి శ్రీ ఆదారి ఆనంద్ కుమార్ గారే ఎందుకు కావాలంటే అనే అంశాన్ని ప్రజలకు సమగ్రంగా వివరించాలన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా పశ్చిమంలో మన భవిష్యత్తు మారాలన్న ఆనంద్‌కుమార్ గారిని గెలిపించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పదవితో సంబంధం లేకుండా నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న వ్యక్తి ఆనంద్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో 91వ వార్డు అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు 92వ వార్డు అధ్యక్షులు జి. అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకృష్ణ, దేరెడ్ల సత్యనారాయణ రెడ్డి, చుక్క పైడిరాజు రెడ్డి, చుక్క స్వామి రెడ్డి, వై శ్రీను, తంబిరెడ్డి, తాతారావు, చుక్క రాము, చుక్క రమణ, మల్ల రామారావు, దొడ్డి రామచంద్రరావు, పూటపల్లి గోవింద్, జీవి రమణ, రమణ, శివ, సీ.వో. ఝాన్సీ ఆర్పీలు, కన్వీనర్లు, వివిధ అనుబంధ సంస్థల మహిళలు, సచివాలయం సిబ్బంది, వాలంటరీలు పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రతీక పొట్టి శ్రీరాములు

జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రతీక అమరజీవి పొట్టి శ్రీరాములు అని జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ కొనియాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు కోల్పోయిన మహనీయులు, అమరజీవి పొట్టి శ్రీరాములు అని అన్నారు. తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీక శ్రీ పొట్టి శ్రీరాములు అని, తన ప్రాణత్యాగంతో ప్రత్యేక తెలుగు రాష్ట్రం ఏర్పడేలా చేసి అమర జీవిగా నిలిచారని గుర్తు చేశారు. ఆయన వర్ధంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ నివాళులర్పించి స్మరించుకోవలసిన తరుణమిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి కె.వి. ఈశ్వరరావు, వివిధ విభాగాల పర్యవేక్షకులు, రెవిన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొని పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పించారు.

అంగన్వాడిల ఉద్యమానికి యుటిఎఫ్ సంఘీభావం

విశాలాంధ్ర - గంగవరం : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మెలో భాగంగా స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట గత నాలుగు రోజులుగా చేపట్టిన ధర్నా కార్యక్రమానికి యుటిఎఫ్ మండల శాఖ మధ్యాహ్నం భోజనం గ్రామ సమయంలో శిబిరంలోనికి చేరుకొని సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఈ సంద ర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా యుటిఎఫ్ శాఖ కోశాధికారి కోసు కృష్ణ దొర మాట్లాడుతూ అంగన్వాడి సోదరీమణులకు ప్రభుత్వ ఉద్యోగ హొదా ఇవ్వాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని రిటైర్మెంట్ అనంతరం గ్రాడ్యుటీ చెల్లించాలని, మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని యుటిఎఫ్ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు సిహెచ్ రాంబాబు, కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు రఘు బాబు దొర. నాయకులు బుజ్జి దొర, సత్య కిరణ్ రెడ్డి, లావణ్య, రాములకొండ చిన్న వెంకటరెడ్డి, కె రాంబాబు, ఎస్ పాపారావు సుమారు 20 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాలుగవ రోజుకు చేరిన అంగన్వాడీల సమ్మె

విశాలాంధ్ర - రావికమతం : అంగనవాడిలా సమస్యలపై తలపెట్టిన సమ్మె నాలుగవ రోజుకు చేరుకుంది. మండల కేంద్రం శివాలయం ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమ్మెకు చోడవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ పివిఎస్ ఎన్ రాజు, మండల పార్టీ అధ్యక్షుడు మైచర్ల నాయుడు పలువురు కార్యకర్తలు అంగన్వాడీలకు మద్దతు తెలిపారు. అంగన్వాడీల సమ్మెలో జనసేన పార్టీ నాయకులందరూ కూర్చొని నోటికి నల్ల బ్యాడ్జి ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పివిఎస్ ఎన్ రాజు మాట్లాడుతూ జగన్ రెడ్డి పరిపాలన అంతా అస్తవ్యస్తంగా సాగుతుందన్నారు .అలాగే రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటిబడి చాలా అధ్వాన్న పరిస్థితిలో ఉందన్నారు . ఇప్పటికే పలువురు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు , ప్రజా సంఘాలు, అలాగే వారి సొంత పార్టీకి చెందిన వైసిపి నాయకులు పూర్తి వ్యతిరేకతతో ఉన్నారన్నారు. రేపు రానున్న ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి గుణపాఠం చెప్పడానికి వీరంతా సిద్ధంగా ఉన్నారన్నారు. అన్ని వర్గాల వారిని మోసం చేస్తూ వారి నడ్డి విరగగొట్టిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు మైచర్ల నాయుడు, పలువురు కార్యకర్తలు, ప్రాజెక్టు అధ్యక్షురాలు బి వరలక్ష్మి, పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

50 మంది దివ్యాంగ విద్యార్థులకు రగ్గులు వితరణ

దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేత

విశాలాంధ్ర - రావికమతం : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా 50 మంది దివ్యాంగ విద్యార్థులకు శుక్రవారం వడ్డాది గ్రామానికి చెందిన దొండా చంద్రమౌళి మరియు పద్మావతి దంపతులు పదివేల రూపాయలు విలువ చేసే రగ్గులను వితరణ చేయగా వాటిని మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.రామారావు చేతుల మీదుగా అందజేయడం జరిగింది. అలాగే మండలంలో గల దివ్యాంగ విద్యార్థులకు పరుగుల పందెం, మ్యూజికల్ చైర్, వీల్ చైర్ బాల్ గేమ్ వంటి క్రీడలు నిర్వహించి గెలుపొందిన దివ్యాంగ విజేతలకు ప్రధానోపాధ్యాయులు వి రామారావు, తెలుగు ఉపాధ్యాయులు గెంజి నాగేశ్వరరావు, స్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాథ నాయుడు, సరోజిని చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరిగింది. అలాగే మండలంలో దృష్టి లోపం మరియు వినికిడి లోపం గల ఐదుగురు దివ్యాంగ విద్యార్థులకు 1,50,000 విలువచేసే డిజిటల్ ట్యాబ్ లను ప్రధానోపాధ్యాయులు మరియు ప్రత్యేక ఉపాధ్యాయులు చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.రామారావు మాట్లాడుతూ దివ్యాంగుల సేవయే విశ్వ మానవ సేవ అని, దివ్యాంగులకు దాతలు అందరూ సహాయం చేయడం చాలా అభినందనీయమని అన్నారు. అలాగే దివ్యాంగ విద్యార్థులకు కొవ్వూరు శివారెడ్డి మరియు కర్రీ నరసింహారెడ్డిలు 1500 రూపాయలు వితరణగా అందించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మావతి, నాగమణి, శాంతి, శ్యామల, బాలరాజు,రమణాజీ గోవిందరావు, నాగేశ్వరరావు, మండలంలో గల దివ్యాంగు విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ప్రత్యేక ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

5వ విడతలో 346 మొబైల్ ఫోన్లు రికవరీ

ఎస్పీ కె.వి. మురళీకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : ఐదో విడత మొబైల్ ఫోన్లు రికవరీలో 68 లక్షలు విలువగల ఫోన్లు రికవరీ చేసినట్లు ఎస్పీ కె.వి. మురళి కృష్ణ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రికవరీకి సంబంధించిన వివరాలను వెల్లడించి, బాధితులకు మొబైల్ ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు మొత్తం సుమారు 2100 ఫిర్యాదులు నమోదు కాగా, మొత్తం 5 విడతల్లో 1238 మొబైల్ ఫోన్లను (సుమారు విలువ రూ. 2కోట్లు 20 లక్షల రూపాయలు) పొగోట్టుకున్నవి ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొబైల్ మిస్సింగ్ పోర్టల్ CEIR (https://www.ceir.gov.in%/) లో మీ పోయిన మొబైల్ ఫోన్ వివరాలు అందించవచ్చు అన్నారు. ఆపై వెంటనే ఐటీ కోర్ బృందం ట్రేస్ చేస్తూ బాధితులకు మొబైల్స్ అందజేసేందుకు కృషి చేస్తుందన్నారు. అలాగే మొబైల్ ఫోన్ పోతే జిల్లా పోలీసు వాట్సాప్ నెంబర్:95052 00100 కు అని టైప్ చేయడం ద్వారా (%akpmobiletracker.in%) లింక్ నొక్కడం ద్వారా పోయిన మొబైల్స్ ఫిర్యాదుల స్వీకరణకు ఎఫ్.ఐ.ఆర్ కట్టకుండా, పోలీసు స్టేషన్ కు వెళ్లకుండా సులభతరం చేసిన జిల్లా పోలీసులు, మొబైల్ వివరాలను తెలియజేస్తే బాధితులకు త్వరితగతిన అందజేసేందుకు కృషి చేస్తామన్నారు. మొబైల్ మిస్సింగ్ గురించి ప్రజలు పోలీసు స్టేషన్ లకు వెళ్ళడంపై అసౌకర్యంగా ఉందని ఫీడ్ బ్యాక్ రావడంతో సులభతరమైన పద్ధతిలో మొబైల్ ట్రాకింగ్ సర్వీస్ వెబ్ సైట్ ను ఏర్పాటు చేశామన్నారు. మొబైల్ మిస్సింగ్ కేసులలో త్వరితగతిన రికవరీ అవుతున్నందువలన ప్రజలు మొబైల్ మిస్సింగ్‌పై ఫిర్యాదులు చేయుటకు ముందుకు వస్తున్నారు. సెల్ ఫోన్లు పోగొట్టుకున్న, చోరి అయిన వాటి పరిష్కారం పై అనకాపల్లి జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. సెల్ ఫోన్లు రికవరీ చేసి ఇవ్వడం ఆనందంగా ఉందని జిల్లా పోలీసులకు సెల్ పోన్లు పొందిన లబ్ధిదారులు, బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ మొబైల్ రికవరీ మేళా కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయ భాస్కర్, అదనపు ఎస్పీ (క్రైమ్స్) పి.సత్యనారాయణరావు, ఇన్స్పెక్టర్లు చంద్రశేఖర్, లక్ష్మణ్ మూర్తి, పైడపు నాయుడు, అప్పలనాయుడు, ఐటి కోర్ ఎస్సై రఘు వర్మ పాల్గొన్నారు.